

7న వైఎన్‌లో జాతీయ సదస్సు

నరసాపురం: జివిఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైఎన్ బిఇడి కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అక్టోబర్ 7న తెలుగు సాహిత్యం-భాషా బోధన - మనో వికాసంపై జాతీయ సదస్సు ఏర్పాటు చేసినట్లు వైఎన్ బిఇడి కళాశాల ప్రిన్సిపల్ పిట్టా శాంతి, వైస్ ప్రిన్సిపల్ ముత్యాల కళ్యాణ్, సాహిత్య ప్రముఖులు డాక్టర్ బూసి వెంకటస్వామి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉప అంశాలుగా ప్రాచీన సాహిత్యం (భారత, భాగవత, రామాయణాలు) భాషా బోధన-మనో వికాసం, శైవ సాహిత్యం - భాషా బోధన - మనో వికాసం, ప్రబంధ సాహిత్యం-భాషా బోధన - మనో వికాసం, దక్షిణాంధ్రయుగ సాహిత్యం భాషా బోధన మనో వికాసం, శతక సాహిత్యం భాషా బోధన మనో వికాసం, జానపద, గిరిజన వినం- భాషాబోధన-మనో వికాసం తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు ఉంటాయని వివరించారు. మిగతా వివరాల కోసం సెల్ 9059731980, 8985827882 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మెడికల్ కాలేజీని ప్రయివేటుకు అప్పగిస్తే..

ఉద్యమమే..

పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన భీమవరం నుండి దగ్గులూరు మెడికల్ కాలేజీ వరకు బైక్ ర్యాలీ

నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కాలేజీ కట్టడాల సందర్శన



దగ్గులూరులో మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతం వద్ద నినదిస్తున్న నేతలు, కార్యకర్తలు, ప్రజలు

ప్రజాశక్తి - భీమవరం

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా, వైద్య రంగాన్ని మరింత ఖరీదుగా మార్చేలా మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రయివేటోళ్లకు అప్పగించేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌక్ నుండి దగ్గులూరు మెడికల్ కాలేజీ వరకూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెడికల్ కాలేజీ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపి పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ వైద్య విద్య ప్రభుత్వ రంగంలోనే ఉంటే ప్రజానీకానికి, రాష్ట్రాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. వైద్యరంగం ప్రభుత్వ అధీనంలో ఉన్న అనేక దేశాల్లో వైద్య సదుపాయాలు ప్రజలకు ఎలా అందించబడుతున్నాయో, కార్పొరేట్లపరమైతే ప్రజలకు ఎలా ఖరీదుగా మారుతున్నాయో కరోనా సమయంలో మనందరికీ తెలిసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పిపిపి విధానాన్ని తక్షణం విరమించుకోవాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రయివేటుపరమైతే పేద విద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమాలకు ఎస్ఎఫ్ఐ సిద్ధపడుతోందన్నారు. గత ప్రభుత్వం దోచుకుందని చెబుతున్న



భీమవరం నుంచి ప్రారంభమైన ర్యాలీ

కూటమి ప్రభుత్వం, నేడు మెడికల్ కాలేజీలను అమ్మేసి ఎంత దోచుకుంటుందని ప్రశ్నించారు. తక్షణం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు లంకా కృష్ణమూర్తి, ఎంసిపిఐ(యు) నాయకులు కె.మహంకాళి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు 590 జిఒ జారీ చేసి మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరిస్తున్నారన్నారు. దీనివల్ల పేద విద్యార్థి తన లక్ష్యాన్ని ఎలా చేరుకుంటారని ప్రశ్నించారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈద శేఖర్‌బాబు మాట్లాడుతూ దేశ సంపదను దోచుకున్న బ్రిటిష్ వాళ్లే విద్య, వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంపదను దోచుకుంటూ విద్య, వైద్యాన్ని వ్యాపారం చేసి కార్పొరేట్లకు అప్పగిస్తోందని మండిపడ్డారు. మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణను అడ్డుకునే వరకు ఎంత పెద్దస్థాయి ఉద్యమానికైనా ప్రజలంతా ఐక్యంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యం అత్యంత ఖరీదైన వ్యాపారంగా మార్చి ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, ఎపి సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పెంద్ర వీరన్న మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడే సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడాన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీ నిర్వహణ నుంచి ప్రభుత్వం తప్పుకుని ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడం అంటే అతిపెద్ద అవినీతే అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తే రాజ్‌కుమార్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ అధ్యక్షుడు సూడదాసు గంగయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, ఐలు జిల్లా నాయకులు రామాని కాస్ట్రో, జెవివి జిల్లా నాయకులు మల్లుల శ్రీనివాస్, రిటైర్డ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి బిఎన్ఎస్.ప్రసాద్, రిటైర్డ్ తహశీల్దార్ బి.ప్రసాద్, ఎపి బహుజన జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.రమేష్, కాంగ్రెస్ పార్టీ సిసిఎల్ జిల్లా అధ్యక్షులు కాకర రాజ్‌కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, రైతుసంఘం జిల్లా నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య ప్రసాద్, షేక్ వలీ, సిపిఐ జిల్లా నాయకులు సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

సమిత్వ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సమిత్వ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. మంగళవారం విస్సాకోడేరు గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సమిత్వ సర్వేపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. ఎన్ని పిపిఎంలు ఉన్నాయి, ఇప్పటి వరకు ఎన్ని మ్యాపింగ్ అయ్యాయి, మ్యాపింగ్ చేసేటప్పుడు ఏ విధానాలను పాటిస్తున్నారని ప్రశ్నించారు. విస్సాకోడేరు గ్రామంలో స్వయంగా ఒక పిపిఎంను పరిశీలించారు. అలాగే స్వర్ణ పంచాయతీ వెబ్ పోర్టల్‌ను స్వయంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పన్నులను వసూలు చేస్తున్నారా, పెండింగ్ ఏమైనా ఉన్నాయా, డిమాండ్లు ఇస్తున్నారా, వసూలు చేసిన పన్నులను ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తున్నారా అని అడిగి ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విస్సాకోడేరు సచివాలయ పరిధిలో సమిత్వ గ్రౌండ్ ట్రూత్తింగ్ పనులు 88 శాతం పూర్తయ్యాయని, డిజిటల్ మ్యాపింగ్ 58 శాతం పూర్తయ్యాయని, నూరు శాతం శనివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సమిత్వ సర్వేలో నిర్లక్ష్యం వహించొద్దని, తప్పులు లేని నివేదికలను రూపొందించాలని అన్నారు. పంచాయతీలో పన్నుల వసూలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డిపిఒ ఎం.రామ్‌నాథ్‌రెడ్డి, తహశీల్దార్ ఎస్.విజయలక్ష్మి, ఎంపిడిఒ వి.రెడ్డయ్య, ఇఒపిఆర్‌డి మల్లాది రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కె.పవన్‌కుమార్, గ్రామ సర్పంచి బి.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



నినదిస్తున్న నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ టిడిపి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రాష్ట్రపతి రోడ్డులో ఉన్న బోయ్స్ హైస్కూల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, కోకన్వీనర్ ఎన్.ఆదినారాయణబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యాల కోసం కార్మికులు ఎన్నో రోగాలను సైతం లెక్క చేయకుండా పని చేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 17 రోజుల సమ్మె కాలంలో ఒప్పందాలకు జిఒలు ఇవ్వాలన్నారు. జులై సమ్మెకాలం వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, అర్జి కృష్ణబాబు, రమేష్, అయ్యప్ప, అనంత లక్ష్మి, నీలాపు రవి, కాకి రమణ, కె.రాజమ్మ, రాంబాబు, వెంకటేశ్వరావు, అరుణాదేవి, ఎస్.పద్మ, పి.జ్యోతిబాబు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి

సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - పాలకొల్లు

కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని, అదే ఆయనకు నిజమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం అన్నారు. మంగళవారం స్థానిక మహిళా భవనంలో ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ అంతరాలు లేని సమాజం కోసం ఏచూరి ఎంతో కృషి చేశారన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా తన సేవలు అందించారని, ఇతర దేశాల్లో కమ్యూనిస్ట్ పార్టీలో తలెత్తే సంక్షోభాల నివారణకు చర్చల ద్వారా పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. విద్యార్థి దశలోనే ప్రధానిని సైతం ఘెరావ్ చేసి సమస్యలపై పని చేశారన్నారు. ఏచూరి ఆశయాల అమలుకు అంతా పని చేయాలని సీతారాం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓ సోషలిస్ట్ ఆచరణ పదం అంశంపై స్టడీసర్కిల్ నిర్వహించారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీనివాసరావు, కానేటి బాలరాజు, డి.జయప్రభ, వై.అజయ్‌కుమార్, మాచవరపు సుబ్బారావు పాల్గొన్నారు.

నరసాపురం: ఇంటి స్థలం లేని పేదలకు స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మీరా భవనంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తూ జోహార్లు అర్పించారు. ఈ సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. గోపాలన్ మాట్లాడుతూ దేశంలో సమ సమాజం ఏర్పడాలంటే అది సోషలిజం ద్వారానే జరుగుతుందని, అట్లాంటి సోషలిజం కమ్యూనిస్టు సిద్ధాంతం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం తన జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేసిన యోధుడు ఏచూరి అన్నారు. ఏచూరి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం కేటాయించి ఇల్లు నిర్మిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణం అమలు చేయాలని కోరారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు త్వరితగతిన అందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్, నేతలు తెలగంశెట్టి సత్యనారాయణ, కడలి రవి, గుబ్బల చిన్ని, నోముల కొండ, బుడిద జోగేశ్వరరావు, జి.ఆజాద్, మల్లుగుంట నాగలక్ష్మి, కొరడా బద్రి, పులపర్తి సత్యనారాయణ, మల్నీడి సురేష్, వేణుగేటి కొండాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేవీ ఆయుధ డిపో మాకొద్దు

జీలుగుమిల్లి మండలం మడకంవారిగూడెంలో కదంతొక్కిన గిరిజనులు

గిరిజనుల ర్యాలీపై విరుచుకుపడిన పోలీసులు, తీవ్ర ఉద్రిక్తత

పెద్దఎత్తున తోపులాట.. మహిళలను సైతం ఇష్టానుసారం తోసేసిన ఖాకీలు

అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన

ఏజెన్సీని మాయం చేస్తున్నారంటూ అడవి బిడ్డల ఆవేదన

కమీషన్ల కోసం ఎంపీ, ఎంఎల్ఎ తమను తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం

ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్న నేతలు



గిరిజన మహిళలను అడ్డుకుంటున్న మగ పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జీలుగుమిల్లి

'నేవీ ఆయుధ డిపో మాకొద్దు' అంటూ గిరిజనులు మంగళవారం కదంతొక్కారు. అయితే గిరిజనుల ర్యాలీని పోలీసులు అడ్డుకుని బలప్రయోగం చేయడంతో జీలుగుమిల్లి మండలం మడకంవారిగూడెంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మడకంవారిగూడెం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ శాంతియుతంగా గిరిజనులు చేపట్టిన ర్యాలీని పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించి అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. గిరిజన మహిళలను, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు బలవంతంగా మెడలు పట్టుకుని పక్కకు లాగేశారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని ముందుకు సాగిన గిరిజనులను గ్రామశివార్లలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వందల సంఖ్యలో గ్రామస్తులు అక్కడే బైఠాయించి నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా నినదించారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని మడకంవారిగూడెం, దాట్లవారిగూడెం, వంకావారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం మొత్తం ఐదు గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుంది. ఆయుధ డిపో కోసం 1,166 ఎకరాలు సేకరించడంతోపాటు ఆయా గ్రామాలను ఖాళీ చేయించేందుకు సిద్ధమైంది. గతంలో మూడుసార్లు గ్రామసభలో వ్యతిరేకంగా తీర్మానం చేసినప్పటికీ మళ్లీ నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రతిపాదించడాన్ని ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఐదు గ్రామాల ప్రజలు మడకంవారిగూడెం నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే సోమవారం నుంచి జీలుగుమిల్లి మండలంతోపాటు బుట్టాయగూడెం, టి.నరసాపురం మండలాల్లో పోలీసులు 30 యాక్ట్ అమలు చేసి తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. ప్రజాసంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేసేందుకు వేటాడారు. గిరిజనుల ర్యాలీని అడ్డుకునేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేశారు. పోలీసుల కంటపడకుండా వందలాది మంది గిరిజనులు మంగళవారం ఉదయం మడకంవారిగూడెం చేరు కున్నారు. అక్కడ నుంచి వారంతా ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అడ్డుకుని తీవ్ర బలప్రయోగం చేశారు. పోలవరం డిఎస్‌పి ఆధ్వర్యంలో సిఐ, ఐదుగురు ఎస్ఐలు, పెద్దఎత్తున పోలీస్ సిబ్బంది గిరిజనులను ముందుకు సాగకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో గిరిజనులకు, పోలీసుల మధ్య పెద్దఎత్తున తోపులాట సాగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవిని పోలీసులు చుట్టుముట్టి పక్కకు తోసేశారు. గిరిజన నాయకులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్, తెల్లం



గిరిజనులను లాగేసే ప్రయత్నం చేస్తున్న పోలీసులు



గిరిజనులు, పోలీసుల మధ్య తోపులాట

దుర్గారావు, మడకం వెంకటేశ్వరరావుతోపాటు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, గుడెల్లి వెంకట్రావు, కిరణ్, కారెం నాగదుర్గ, కారెం ధారయ్య, కారెం రాఘవ, తగరం బాబూరావు, కొండలరావు, తెల్లం సంకురుడు, బండి వెంకటేశ్వరరావుతోపాటు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్న గిరిజన మహిళలపై పోలీసులు విరుచుకుపడి ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. దీంతో అంతా అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారంతా 'ఆయుధ డిపో మాకొద్దు, ఏజెన్సీని ఛిద్రం చేయొద్దు, మమ్మల్ని ఇలా బతకనీయండి, కమీషన్ల కోసం మా ఓట్లతో గెలిచిన ఎంపీ, ఎంఎల్ఎ కేంద్రానికి తమను తాకట్టు పెట్టొద్దు' అంటూ పెద్దఎత్తున నినదించారు.

నేవీ ఆయుధ డిపో నిర్మిస్తే ఏజెన్సీ కనుమరుగు..

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

రోడ్డుపై బైఠాయింపు సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ నేవీ ఆయుధ డిపో ఏర్పాటైతే ఏజెన్సీ అనేది కనుమరుగవుతుందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పేరుతో పలు గిరిజన గ్రామాలను ఖాళీ చేయించారన్నారు. జల్లేరు, పోగొండ జలాశయాల కోసం గిరిజనులు భూమి త్యాగం చేశారని గుర్తు చేశారు. అప్పట్లో ఇంటికో ఉద్యోగం, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వాలు, అధికారులు మాటలు చెప్పారని, భూములు సేకరించాక గిరిజనులను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ నేవీ ఆయుధ డిపో ఏర్పాటు అంటూ తమ భూములను లాక్కుని, ఇక్కడ గిరిజనులను తరిమికొట్టడానికి కుట్ర చేస్తున్నారన్నారు. ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరావు, ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ, నేత తెల్లం దుర్గారావు, పలువురు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదన్నారు. పరిహారంగాని, ఇళ్లకు ఇళ్లుగాని, యువతకు పరిహారంగాని, భూమికి భూమి వంటి అనేక సమస్యలు అలానే ఉన్నాయని తెలిపారు. వీటిపై గిరిజనులకు అనుకూలంగా ఎంఎల్ఎగాని, ఎంపీగాని మాట్లాడిన దాఖలాలు లేవని విమర్శించారు. ఇప్పుడు పాలకులు ఏం చెబితే అదే అన్నట్లు పోలీసులు వ్యవహరించడం బాధాకరమని వాపోయారు. ఆయుధ డిపో పెట్టుకోవాలంటే ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం పక్కన చాలాభూమి ఖాళీగా ఉందని, అక్కడ పెట్టుకోవచ్చని సూచించారు. లేదా మైదాన ప్రాంతంలో పెట్టుకోవచ్చున్నారు. ఒకవేళ ఇక్కడే పెట్టాలని అనుకుంటే మైదాన ప్రాంతంలో ఎకరానికి రెండు ఎకరాలు చొప్పున ఇచ్చి దాన్ని ఏజెన్సీగా నోటిపై చేయాలని కోరారు. ఆయుధడిపోపై వెనక్కి తగ్గకపోతే ఉద్యమం ఆగదని, త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించడంతోపాటు ఏజెన్సీలోని అన్ని మండలాలకు ఉద్యమాన్ని విస్తరిస్తామన్నారు..



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

పని గంటల పెంపు అన్యాయం

సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

పని గంటల పెంపుతో కార్మికుల శ్రమను దోచుకోవడానికి కార్పొరేట్లకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ పడుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెల్లగంశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పని గంటల పెంపు బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ మంగళవారం సాయంత్రం నిరసన తెలిపారు. 10 గంటల పని విధానాన్ని రద్దు చేసి 8 గంట ల పని విధానాన్ని కొనసా గించాలని సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీత, మొగల్తూరు సొసైటీ సిఇఒ కొత్తపల్లి గోవిందరాజులు, సిఐటియు మండల అధ్యక్షులు కంచర్ల సోనీ, నాయకులు ఎడ్ల చిట్టిబాబు, అడ్డాల ఏడుకొండలు, చిలకలపూడి నాగేశ్వరరావు, సత్యనారాయణ, కడలి ముత్యాలరావు, పి.బేబీరాణి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఇరగవరం: పని గంటల పెంపును వెంటనే ఉపసంహరించాలని సిఐటియు జిల్లా నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పని గంటల పెంపును ఉపసంహరించుకోకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జుత్తిగ రామాంజనేయులు, కోకన్వీనర్ సిహెచ్.విజయకుమారి, నేతలు జక్కంశెట్టి గంగాధర్ రావు, వి.నాగలక్ష్మి, జయ వెంకటరమణ, గుబ్బల ముత్యాలు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఇరగవరంలో..



మొగల్తూరులో..

రైతు సేవా కేంద్రాల ద్వారానే ధాన్యం అమ్మాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

పండించిన ధాన్యాన్ని రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారానే విక్రయించాలని తహశీల్దార్ కె.రాజకిషోర్ అన్నదాతలకు సూచించారు. మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఎఒ అబ్దుల్ రహీం అధ్యక్షతన అవగాహనా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపైసి ద్వారా రైతు సేవా కేంద్రాల ద్వారా రైస్ మిల్లులకు తరలిస్తారన్నారు. విక్రయించిన ధాన్యానికి 48 గంటల్లో అన్నదాతల ఖాతాలో నగదు జమ అవుతుందని, దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బందెల ఎలీషా, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉండి : రైతులు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారానే అమ్మకాలు జరపాలని మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఉప్పులూరు, ఉనదుర్రులో ధాన్యం సేకరణ ఖరీఫ్ 2025కు సంబంధించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు దళారులు, మధ్యవర్తులపై ఆధారపడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా మాత్రమే ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. కామన్ రకాలకు సంబంధించి క్వింటాల్‌కు రూ.2,369 రూపాయలకు గాను, సూపర్ ఫైన్ అయితే గనుక ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389గా కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని తెలిపారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఉప్పులూరు గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు, ఉనదుర్రు సర్పంచి పిన్నమరాజు నాగలక్ష్మి, వ్యవసాయ సహాయకులు వంశీ, భాను ప్రకాష్, ఉప్పులూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - తణుకు

లక్షలాది మంది కార్మికులు సభ్యులుగా ఉన్న భవన నిర్మాణ సంక్షేమ బోర్డును మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో సంక్షేమ బోర్డును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. సంక్షేమ బోర్డులో నిధులను సైతం పక్కకు మళ్లించిందని విమర్శించారు. సభ్యులు దాచుకున్న సొమ్మును సైతం గత ప్రభుత్వం దోచుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కమిటీని నియమించిందని గుర్తు చేశారు. సుమారు 50 వేల మంది క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణం పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

పేద ప్రజలను ఆదుకోవాలనే ఉద్దేశంతో జనసేన ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వల్లూరులో జనసేన ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెల 22వ తేదీన మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా వల్లూరు గ్రామ జన సైనికుల జనసేన ఆధ్వర్యంలో గ్రామంలోని పేదలకు ప్రతి నెలా కొంతమందికి సహాయం చేయాలనే ఆలోచనతో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కోమటివారిపాలెం, గెద్దాడవారిపాలెం, కాసానివారిపాలెం గ్రామాల్లో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ అధ్యక్షులు కడిమి ఉమా మహేశ్వరస్వామి, సొసైటీ అధ్యక్షులు తోట ఆదినారాయణ, జనసేన మండల కార్యదర్శులు కాపవరపు రామకృష్ణ, పంపన శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు వెండి ఆభరణం బహూకరణ

ప్రజాశక్తి - కాళ్ల

అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఉప సర్పంచి బూడి వెంకట పద్మారావు అన్నారు. కోపల్లెలోని కనకదుర్గమ్మ, పోలమ్మ అమ్మవార్లకు గ్రామానికి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి రాధాకృష్ణంరాజు, రమావతి దంపతులు, కుటుంబ సభ్యులు కేజీ వెండితో (సుమారు రూ.1.67 లక్షలు) చేసిన పులి ఆభరణాన్ని బహూకరించి మంగళవారం అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్తులు సత్కరించి అభినందించారు.

ప్లే స్కూల్ వద్దు.. అంగన్వాడీలే ముద్దు

ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీకాంతం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారంతో పాటు వారికి కావాల్సిన విద్యా సామగ్రి అందజేస్తున్నారని, అయితే అవగాహన లేని తల్లిదండ్రులు తమ చిన్నారులను డబ్బులు ఇచ్చి ఎటువంటి ఉపయోగం లేని స్కూల్లో చేర్పిస్తున్నారని, అయితే ప్లే స్కూల్ వద్దు అంగన్వాడీలే ముద్దు అనే నినాదంతో ముందుకు సాగాలని పాలకోడేరు ఐసిడిఎస్ సిడిపిఒ కె.లక్ష్మీకాంతం అన్నారు. రాయలం ఐదు అంగన్‌వాడీ సెంటర్లను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతోపాటు, స్కూల్లో చిన్నారులకు సైతం పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అనిల్ కుమార్, టీచర్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

పసలదీవిలో ముంపు పొలాల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పంట పొలాలు మునిగిపోతున్నాయంటూ రైతులు చేసిన పోరాటానికి ప్రభుత్వం, అధికారులు దిగొచ్చారు. మంగళవారం మండలంలోని పసలదీవి గ్రామంలో వెస్ట్ కుక్కలేరు డ్రెయినేజీ వల్ల ముంపునకు గురవుతున్న పొలాలను డ్రెయినేజీ శాఖ ఎడి పావని పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. గత వారం పసలదీవి రైతులంతా ఈ సమస్యపై ఆందోళన దిగిన విషయం విదితమే. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్‌కు రైతుల సమస్య వివరించారు. సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే ఎఇ, ఇరిగేషన్ అధికారులు వచ్చి డ్రెయినేజీని పరిశీలించారు. పూడుకుపోయిన డ్రెయినేజీని త్వరలో తవ్వుతామన్నారు. డెల్టా ప్రాజెక్టు ఉపాధ్యక్షులు గుబ్బల మార్రాజు, మాజీ ఎంపిపి వాతాడి కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనంపై సర్వే చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

తీర ప్రాంత మత్స్యకారులతో పాటు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలోని మత్స్యకారుల జీవన పరిస్థితులు, వలసపై ప్రభుత్వ సర్వే చేయించాలని మంగళవారం రాష్ట్ర మత్స్యకార, సంక్షేమ అభివృద్ధి ఫోరం కొల్లు పెద్దిరాజు ఆ శాఖ కమిషనర్ శంకర్ నాయక్‌ను కోరారు. అమరావతిలో కమిషనర్‌ను కలిసి ఐదేళ్ల తీర ప్రాంతంలో మత్స్యకారుల వలసలు పెరిగాయన్నారు. వేటనిషేధ సమయంలో మత్స్యకార సంపద విక్రయకేంద్రం, మార్కెటింగ్ సదుపాయం, ఆధునిక పరికరాలు లేకపోవడం వంటి కారణాలు సంప్రదాయ వృత్తిని విడిచి పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారన్నారు. గతంలో నిపుణుల సమయంలో మత్స్యకారులు వలసలు ఉండేవన్నారు. వీటిపై ఒక సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించాలని పెద్దిరాజు కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు పెద్దిరాజు చెప్పారు.

మహిళా సాధికారతపై అవగాహన

ప్రజాశక్తి - తణుకు

మహిళా సాధికారత కేవలం ఆర్థిక స్వావలంబన మాత్రమే కాదని ఆత్మవిశ్వాసంతోపాటు నిర్ణయాధికారం పొందడమని సింగపూర్ ఐటి ప్రొఫెషనల్, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి సతీమణి ఆరిమిల్లి కృష్ణతులసి అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ, మానవత సంయుక్త ఆధ్వర్యంలో తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా కృష్ణతులసి పాల్గొని మాట్లాడారు. విద్యతోనే మహిళలు కుటుంబం, సమాజం, దేశాన్ని వెలుగులోకి నడిపించగలరన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. హింస, వివక్ష తొలగించేందుకు యువతలో చైతన్యం కల్పించాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని, ప్రతి రంగంలో ప్రతిభను చూపించాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. అనంతరం కృష్ణతులసిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.రాధాపద్మావతి, కె.వెంకట సూర్యనారాయణ, గమని రంగారావు, బోయపాటి రామలక్ష్మి, మానవత అధ్యక్షులు కె.రాజా రాజేశ్వరరావు, కెరీర్ గైడెన్స్ సెల్ జిల్లా కన్వీనర్ కె.శారదా దేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.రత్న కుమారి పాల్గొన్నారు.

మురుగు నీటితో తాగునీటి చెరువు కలుషితం

చినపుల్లేరు గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చినపుల్లేరు గ్రామంలో ప్రజారోగ్యం ప్రమాదంలో పడేలా ఉందని, గ్రామంలోని తాగునీటి చెరువులోకి సర్పంచి ఇంటి సమీపంలోని సుమారు 10 ఇళ్ల నుంచి మురుగునీరు నేరుగా గ్రామంలోని తాగునీటి చెరువులో కలుస్తోందని దీంతో ఆ నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నామని, అధికారులు తక్షణం స్పందించాలని చినపుల్లేరు గ్రామస్తులు కోరుతున్నారు. మంగళవారం గ్రామస్తులు సర్పంచి ఇంటి ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలోని సుమారు 10 ఇళ్లకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదని, దీంతో ఆయా ఇళ్లలోని వాడకం, మురుగు నీరు డ్రెయినేజీ ద్వారా పంట బోదెలోకి వెళ్తోందని అక్కడి నుంచి రక్షిత నీటి చెరువులోకి వెళ్తోందన్నారు. సర్పంచి భర్త రామరాజును ఇటీవల తమ సమస్య పరిష్కరించాలని కోరగా పూర్వం నుండి వస్తుందని ఇప్పుడు నేనేం చేయలేనని ఆయన తెలిపారని, ఇది ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. 'గ్రామంలో రూ.10 లక్షలతో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేశారని, త్వరలో వీటి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కలుషిత నీరు చెరువులో కలిస్తే ఎన్ని ఫిల్టర్లు పెట్టినా ఉపయోగం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ చెరువు నీరు తాగి చాలామందికి ఒళ్లంతా దద్దుర్లు వచ్చి వాంతులై ఇబ్బందులు పడ్డారన్నారు. ఆ నీటిని పరీక్షించగా మురుగునీరు చెరువులో కలవడం వల్లే ఇలా జరిగిందని రిపోర్ట్ కూడా వచ్చిందని తెలిపారు. సమస్యను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు దృష్టికి తీసుకెళ్తామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను సరిచేసి, చెరువును కాపాడాలని కోరారు. తక్షణం చర్యలు తీసుకోకపోతే తమ ఆరోగ్యం మరింత క్షీణిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు బుద్ధరాజు శ్రీనివాసరాజు, గుడ్ల బలరాముడు, శివరామకృష్ణ, గోడి సుధాకర్, ముగ్గళ్ల సామ్యూల్, బలే మాణిక్యాలరావు పాల్గొన్నారు.



డ్రెయినేజీని చూపుతున్న గ్రామస్తులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని, వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. స్వచ్ఛ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 278 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని హైందవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పిహెచ్‌సిలో అన్ని రకాల రక్త పరీక్షలూ అందుబాటులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల అనేక ప్రమాదాలు ఉన్నాయని, తల్లిదండ్రులు బాల్య వివాహాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరు నెలల శిశువు నుంచి వృద్ధుల వరకూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నేలపూడి బేబీ, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస్, జనసేన నాయకులు చిట్టూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి

అధ్వానంగా చినపుల్లేరు రహదారి

ఆక్వా వ్యర్థాలే కారణమంటున్న వార్డు సభ్యులు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చినపుల్లేరు రహదారి గుంతలతో అధ్వానంగా మారిందని, దీనికి స్థానిక ఆక్వా రైతులే కారణమని గ్రామ సర్పంచి భర్త, వార్డు సభ్యులు పెన్మెత్స రామరాజు ఆరోపించారు. మంగళవారం చిన్నపుల్లేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ రహదారి వెంబడి ఆక్వా చెరువుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తవ్వించడంతో మురుగు బోదె సౌకర్యం లేదని, దీనివల్ల ఆక్వా కలుషిత జలాలు రోడ్లపైకి విడుదల చేయడంతో రహదారులు గుంతలుగా మారి ఛిద్రంగా తయారవుతున్నాయన్నారు. జనవరిలో కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు లక్షల రూపాయలతో రోడ్లన్నీ మరమ్మతులు చేశారని, ఆక్వా రైతులు నిర్లక్ష్యంగా రసాయనాలు కలిసిన ఆక్వా వ్యర్థాలను రోడ్డుపైకి విడుదల చేయడంతో రోడ్లన్నీ గతంలో మాదిరిగా గుంతలుగా తయారయ్యాయని, దీంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆక్వా రైతులను హెచ్చరించినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో ఎంఎల్ఎ కనుమూరి రఘురామ కృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.



గోతులమయంగా ఉన్న చినపుల్లేరు రోడ్డు

యనమదుర్రుపై వంతెనలకు అప్రోచ్ రోడ్లు వేయాలి

అసెంబ్లీ సమావేశంలో ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం - యనమదుర్రు డ్రెయిన్ వంతెనపై 14 ఏళ్ల క్రితం 3 బ్రిడ్జిలను నిర్మాణం చేయడం జరిగిందని, వాటికి అప్రోచ్ రోడ్లు వేయాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కోరారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్రోచ్ రోడ్ల విషయంపై ఇప్పటికే నాలుగు సార్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రికి కూడా తెలియజేశానని, వంతెనలకు అప్రోచ్ రోడ్లు వేస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని అన్నారు.

అప్రోచ్ రోడ్లపై సిపిఎం పోరాటం..

ఇదిలాఉంటే అందరూ కాలువపై ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించాలని దఫదఫాలుగా సిపిఎం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసిన సంగతి తెలిసిందే. వంతెనలకు అప్రోచ్ రోడ్లు లేకపోవడంతో పట్టణ ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇదే విషయమై గతంలోనూ పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే మాట్లాడి తక్షణం పట్టణంలోని సమస్యలను పరిశీలించాలని కోరారు.

రాయకుదురు సొసైటీ చైర్మన్‌గా విజయ్ కుమార్

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ) త్రిసభ్య కమిటీ మంగళవారం బాధ్యతలు చేపట్టింది. చైర్మన్‌గా తోట విజయ్‌కుమార్ (బుజ్జి) బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని విజయకుమార్ అన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి యాళ్ల బండి శ్రీనివాస ప్రసాద్, డైరెక్టర్ జుత్తిగ జమ సత్యనారాయణ, వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామ్ చంద్రమూర్తి, తోట ఆదిబాబు, మొఖమాట్ల దుర్గాప్రసాద్, గుడాల వెంకటేశ్వరరావు, బొరుసు వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ్‌కుమార్

ధాన్యం తక్కువ ధరకు అమ్ముకోవద్దు : జెసి

పోడూరు : మట్టపర్రు గ్రామంలో పొలాలు వద్ద ఏర్పాటుచేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2025-26 సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముకోవాలన్నారు. రైతులు ఎంఎస్‌పి కంటే తక్కువ ధరకు అమ్మొద్దని, దళారులను నమ్మొద్దని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,389, సాధారణ రకానికి క్వింటా రూ.2,369 మద్దతు ధర ఉందని తెలియజేశారు. రైతులు ఇ పంట నమోదు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్లను సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూసార ఆధారిత ఎరువులు వినియోగం పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, తహశీల్దార్ ఎస్‌డి మౌలానా ఫాజిల్, ఎంఎఒ విశ్వేశ్వరరావు, గ్రామ సర్పంచి దొమ్మేటి శ్రీను, వైస్ ఎంపిపి గుబ్బల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ డి.రాంప్రసాద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌కు జాతీయ స్థాయి అవార్డులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు ఎఐసిటిఇ, ఎడు స్కిల్స్ సంయుక్తంగా ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ మూడు రోజులపాటు సిమ్లాలో అకాడమియా, ఇండస్ట్రీ ప్రతినిధులతో జాతీయ స్థాయిలో నిర్వహించిన సదస్సులో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల మూడు అవార్డులు అందుకుందని కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు, ఐటి డిపార్ట్మెంట్ హెడ్, ఎడు స్కిల్స్ కోఆర్డినేటర్, పి.రవికిరణ్ వర్మ మంగళవారం కళాశాలలో మీడియాకు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలకు మంచి అవార్డులు తీసుకురావడంలో విద్యార్థులు సాధించిన కృషి, స్టాఫ్ అంకిత భావం వల్ల ఇన్ని అవార్డులు జాతీయస్థాయిలో సాధ్యమైందని కళాశాల యాజమాన్యం ప్రతినిధులు అభినందించారు.

ఎల్‌బి చర్లలో రైతు సేవా కేంద్రం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని చామకూరిపాలెం, ఎల్‌బి చర్ల రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం 'పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ధాన్యం సేకరణపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోషిల మాట్లాడుతూ కనీస మద్దతు ధర, ఇ-పంటలో రైతుల నమోదు గురించి మాట్లాడారు. దళారులు, మధ్యవర్తులను ఎట్టి పరిస్థితుల్లో సంప్రదించొద్దన్నారు. వాట్సప్ షెడ్యూల్ ద్వారా షెడ్యూల్ చేసుకోవచ్చని, గోనె సంచులు కూలీల ప్రమాణం గురించి, వాహనాలకు జిపిఎస్ పరికరాలు జత చేసుకోవాలని తెలిపారు. రైతు కోరుకున్న మిల్లుకు ధాన్యం తరలించొచ్చని, ట్రక్ షీట్ జనరేషన్ కాకుండా రైస్ మిల్లుకు నేరుగా ధాన్యం తరలించొద్దని తెలిపారు. ఎఫ్‌టిఒ కోసం బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలుంటే జిల్లా కంట్రోల్ రూమ్‌కు 8121676653 టోల్ ఫ్రీ చేయొచ్చన్నారు. ఎఫ్‌టిఒ జనరేట్ చేసిన 48 గంటల్లో చెల్లింపులు విడుదల చేయబడతాయన్నారు. ఎల్‌బిచర్ల సొసైటీ అధ్యక్షులు గుబ్బల వీరాస్వామి, కటకంశెట్టి సంజీవరావు, నరసింహమూర్తి, వెంకట సుధాకర్ వెంకట సుబాకర్, కూనపురెడ్డి నారాయణరావు, బర్రి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

.కాళ్ల : వరి పండించే రైతులు తప్పనిసరిగా ఇ - పంట నమోదు చేయించుకోవాలని, తద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు తెలిపారు. సీసలిలో ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వాట్సప్ ద్వారా రైతులు నేరుగా షెడ్యూలింగ్ పొందొచ్చు, తద్వారా ధాన్యం సేకరణ చేసుకోవచ్చని సూచనలిచ్చారు. ఈ కార్యక్రమం లో సీసలి గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు, వివిఎలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఎల్ఎ, విప్ బొమ్మిడి నాయకర్‌కు వినతిపత్రాన్ని అమరావతి అసెంబ్లీకి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించినట్లు యర్రంశెట్టివారి పాలెం మాజీ సర్పంచి కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు తెలిపారు. మరో కాపీని స్థానిక ఎంఎల్ఎ కార్యాలయానికి అందజేశారు. ప్రధానంగా విజ్జేశ్వరం నుంచి నిడదవోలు మీదుగా నరసాపురం ప్రవహించే ఈ కాలువ వెంబడి విష పదార్థాలతో కూడిన నీరు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా వాటిల్లిందని, తద్వారా ప్రజలు కిడ్నీ, కేన్సర్, లివర్ తదితర అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. ఈ కాలువ వెంబడి ఉన్న ప్రధాన తాగునీటి చెరువులు అయిన నర్సాపురం పట్టణంలోని ఒకటో వార్డులో ప్రధాన చెరువుతో పాటు లక్ష్మణేశ్వరం, రుస్తుంబాధ, తూర్పు తాళ్లు, కెపి.పాలెం, మొగల్తూరు, కాళీపట్నం తదితర గ్రామాలకు ఈ నీరు సరఫరా అవుతోందన్నారు. ఈ చెరువులతో పాటు, ప్రధానంగా విజ్జేశ్వరం నుంచి నరసాపురం వరకూ ప్రవహించే ఈ కాలువ పూడికతీత పనులు చేపట్టేలా అసెంబ్లీ సమావేశంలో ప్రధాన అంశంగా చర్చించాలని సంబంధిత మంత్రిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

వ్యక్తిగత మరుగుదొడ్లకు ప్రాధాన్యతివ్వాలి: కలెక్టర్

భీమవరం: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యతిచ్చి, అవసరం మేరకు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం వద్ద కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ మీటింగ్‌ను సంబంధిత కమిటీ సభ్యులతో కలిపి నిర్వహించి స్వచ్ఛభారత్ మిషన్ పనులు, స్వచ్ఛతాహి సేవ -2025 కార్యక్రమాలు, జల జీవన్ మిషన్ పనులు, విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ సభ్యుల చొరవ, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ 2023 - 24, 2025 - 26లో 1,550 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు కాగా, 915 పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. 103 నిర్మాణాల్లో ఉన్నాయని, ఇంకా 532 ఇంకా ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. సామూహిక మరుగుదొడ్లు నిర్మాణంలో భాగంగా 2022, 2025 - 26 సంవత్సరాల్లో గ్రామ పంచాయతీలు, సంస్థలలో నిర్మాణాలకు 204 మంజూరు చేయగా 130 నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని, 37 నిర్మాణ దశలో ఉన్నాయని, ఇంకా 37 ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. భీమవరం, గణపవరం, మొగల్తూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఉండి మండలాలను నూరుశాతం మోడల్ మండలాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. జిల్లాలోని 294 గ్రామాల్లో 232 గ్రామాలను ఓడిఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఏ గ్రామంలో చేసిన స్వచ్ఛమైన నీరు అందడం లేదంటున్నారని, నీటి పరీక్షలు పారదర్శకంగా చేసి తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి కె.శ్రీనివాసరావు, డిఇ టి.శ్రీనివాస్, డిపిఒ రామ్ నాథ్ రెడ్డి, డిఎంఎన్‌హెచ్ఒ జి.గీతాబాయి, డిఆర్‌డిఒ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా అటవీ శాఖ అధికారి ఆశ కిరణ్, గ్రౌండ్ వాటర్ ఎడి గంగాధర్, డిఎల్‌డిఒ వై.దోసిరెడ్డి పాల్గొన్నారు.

టెండర్ ప్రకటన

Proc.No:19/SA/Admin/DVAP/2025 **Dated:16-09-2025**

of the Collector and District Magistrate, Eluru District, Eluru వారి ఉత్తర్వుల ప్రకారం Nuzvid Consistency, Vision 2047 Team కి ఈ క్రింద తెలిపిన ఐటమ్స్‌కి కొటేషన్లు కోరడమైనది. కొటేషన్లు ది. 17-09-2025 వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయం, నూజివీడు నందు సమర్పించవల్సినదిగా కోరుచున్నాము.

Sl.No.	Description	No. of Items
Computers & Related Items		
1	Desktops (intel I5 14th gen / 8gb Ram / 512gbSSD/20" Led Monitor/Windows 11/Wire keyboard and Mouse	5
2	Laptop (Note Book i5 ultra 5/16gb ram /1tb ssd/windows 11/15.6" screen/msoffice/silver	1
3	Printer cum Scanner (HP/Canon) All in one with scanner, copier, Fax, Auto feeder	1
4	IKV Microtcach UPS	5
Office Furniture		
1	Executive Chair & Table for Hon'ble MLA	1
2	Executive Chair & Table for Spl. Officer	1
3	Air Conditioner	2
4	Desk Based Office Cubical - 5x5	6
5	Staff Chairs	6
6	Visitor Chairs	10
7	Stationery, Internet, Room Partitions & Other expenses	

పాదుల తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తట గ్రామంలో 216 జాతీయ రహదారి పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ సరఫరా లైనుకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పాదులను విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. ప్రజాశక్తిలో సోమవారం విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పాదులు శీర్షికపై ఆ శాఖ అధికారులు మంగళవారం స్పందించారు. విద్యుత్ శాఖ ఎఇ జె.ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు లైన్ ఇన్‌స్పెక్టర్ టివి.శ్రీనివాస్ పర్యవేక్షణలో లైన్ మ్యాన్ పంపన రమేష్ పాదులను తొలగించి సమస్యను పరిష్కరించారు.

నేడు ధాన్యం సేకరణపై అవగాహన

పెనుమంట్ర: మండలంలో ఈనెల 24వ తేదీ బుధవారం నాలుగు రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు సేకరణపై రైతులకు అవగాహనా కార్యక్రమం జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి బి.దేవీ స్వరూప తెలిపారు. ఉదయం పొలమూరు, వెలగలవారి పాలెంలో, మధ్యాహ్నం మాముడూరు, మల్లిపూడి గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. తాను, ఎఒ ఎన్.సత్యనారాయణ రైతులకు అవగాహన కలిగిస్తామని తెలిపారు.

బ్యాడ్మింటన్ టోర్నీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఉండి

ఉండి కలిదిండి అబ్బాయి రాజు జన్మభూమి పార్క్‌లో విజయదశమి సందర్భంగా ఎంఎల్ఎ కనుమూరి రఘురామ కృష్ణరాజు సూచనల మేరకు ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించే బ్యాడ్మింటన్ టోర్నీలో నియోజకవర్గంలోని క్రీడాకారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం జన్మభూమి పార్క్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు 15న కలిదిండి అబ్బాయిరాజు జన్మభూమి పార్క్‌ను ఎంఎల్ఎ రఘురామ కృష్ణరాజు పునఃప్రారంభించారని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన బ్యాడ్మింటన్ కోర్టును పార్కులో ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ టోర్నమెంట్లో విజేతలైన వారికి బహుమతిగా 30 వేల రూపాయలు, రన్నర్లకు 20 వేల రూపాయల నగదు బహుమతి మూడో స్థానంలో నిలిచిన వారికి పదివేల రూపాయలు నగదు బహుమతిని ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 3వ ఎడిషనల్ సివిల్ కోర్టు, ఏలూరు, ఏలూరు జిల్లా.

ఓ.ఎస్.నెం. 110 /2025

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్, గోపన్నపాలెం ...వాది

బిట్వీన్

నిడమనూరి రామకృష్ణ s/o సుబ్బారావు
ముండూరు, పెదవేగి మండలం,
ఏలూరు జిల్లా.
...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది. **06-10-2025** వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్,
స్థలం: ఏలూరు పానుగంటి వారి వీధి, ఏలూరు.
తేది.**23-09-2025** సెల్: 9441276324

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టులో,

I.P.No. 4/2024

Between:

మగటం సతీష్ బాబు ...పిటీషనర్

మరియు

దాసరి వెంకట రమణ వగైరా ...Respondants

1. ఆరుమిల్లి శిరీష, D/o. సాయిబాబు, D.No. 5-52, వీరభద్రస్వామి గుడి దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2. ఆరుమిల్లి సుధీర్ కుమార్, S/o. సాయిబాబు, D.No. 5-51, వీరభద్రస్వామి గుడి దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3. వాడపల్లి రాంగోపాల కృష్ణ, S/o. హనుమంతాచార్యులు, D.No. 3-91, వైష్ణ్యాలయం గుడి దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
4. వాడపల్లి సీతామహాలక్ష్మి, W/o. రాంగోపాల కృష్ణ, D.No. 3-91, వైష్ణ్యాలయం గుడి దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
5. గారపాటి స్వాతి, W/o. సత్యనారాయణ, SBI ఎదురుగా, చించినాడ రోడ్డు, D.No. 1-101, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
6. భాగవతులు లక్ష్మీ నరసింహం, S/o. చిన్న లక్ష్మీ నరసింహం, D.No. 2-108, శివాలయం దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
7. ఉండవల్లి అనంతలక్ష్మి, S/o. నాగభూషణం, D.No. 4-40, వైష్ణ్యాలయం దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.
8. దామిశెట్టి సత్యనారాయణ, S/o. ప్రసాదరావు, D.No. 2-57, వైష్ణ్యాలయం దగ్గర, యలమంచిలి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మీ పై, పై పిటీషనర్ పై కోర్టులో తనని Insolvent గా ప్రకటించమని కోరుచు మీ పై, పై నెంబర్ పిటీషన్ దాఖలు చేసినందున సదరు దావాలో Respondents 6 to 10 మరియు 12 to 14 వ Respondents నకు పలుమార్లు కోర్ట్ ద్వారా నోటీసులు పంపించినను, ఉదేశ్యపూర్వకంగా త్రిప్పి పంపించి వేసినందున శ్రీ పై కోర్ట్ వారి ఎదుట హాజరవుటకు శ్రీ పై కోర్ట్ వారు Respondents అయిన మీ యొక్క హాజరు నిమిత్తం పత్రికలో దిన ప్రకటన చేయవలసినదిగా ఆర్డర్ జారి చేసినారు. సదరు ఆర్డర్ ప్రకారం సదరు పిటీషను **ది. 07-10-2025** తేదికి వాయిదా అయి వున్నది. కాబట్టి మీరు స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని పై కోర్ట్ వారి ఎదుట **ఉదయం గం. 10:30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలియ చేసుకొనవలెను. లేని యడల మీ పరోక్షమున పై పిటీషను తీర్మానం చేయబడును

రామారావు పొన్నమండ B.A.B.L.
నర్సాపురం Advocate,
ది.23-09-2025 Narasapuram